ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 సంచిక : 12 ఆగష్టు 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ .... 03-07-2012

ఖండవల్లి ........ 12-05-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-07-2012, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున వ్యాసుడి యొక్క జయంతి. మన భారతీయ సాహిత్యానికి యిద్దరు మూలపురుషులు ఉన్నారు. 1. వాల్మీకి మహర్షి, 2. భగవాన్ వేదవ్యాసుడు. వేదాల యొక్క సారాన్ని వాల్మీకిమహర్షి రామాయణం రూపంలో తీసుకొనివచ్చాడు, వ్యాసుడు మహాభారతం రూపంలో తీసుకొనివచ్చాడు. వ్యాసుడు రాకపూర్వం వేదాలు రాశికింద ఉండేవి. ఒక రాశిగా ఉన్న వేదాలను ఆయన విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. వేదవ్యాసుడి జన్మదినాన్ని గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు అని అర్థం. మనకు బయట ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు, మన లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించే వాడే గురువు. మీరు ఏ సాంప్రదాయంలో ఉన్నా కనీసం గురుపూర్ణిమ రోజున అయినా ఎవరి గురువును వారు గౌరవించుకోవాలి, యిది గురుపూర్ణిమ రోజున మనం చేయవలసిన పని. మనకు ముగ్గురు ఆచార్యులు ఉన్నారు. శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యులు. ఈ ముగ్గురు కూడా మనం గౌరవింపదగినవారు, ముగ్గురుకూడా మహాపండితులు. ఆచార్యుడు అంటే సద్వస్తువును అనుభవైకవేద్యం చేసుకొని, దానిగురించి ఇతరులకు అర్థమయ్యేలాగా చెప్పేవాడు అంటే తన అనుభవాన్ని ఇతరులతో పంచుకొనేవాడిని ఆచార్యుడు అంటారు. రాముడు, కృష్ణుడు మనకు అవతారపురుషులే అయినా సాంప్రదాయ బద్ధంగా వారికి కూడా గురువులు ఉన్నారు. నారాయణుడు సుప్రీమ్ అని మధ్వాచార్యులు చెపుతారు కాని ఆయనకు శివుడి మీదగాని, ఇతర

దేవతల మీద కాని ద్వేషం లేదు. యితరులను ద్వేషించే బదులు విషం తాగటం మంచిది అని మధ్వాచార్యులవారు చెప్పారు. ద్వేషబుద్ధి ఉన్నవాడు దేనికి పనికిరాడు. వాడు మానసికంగా కుళ్ళిపోతాడు, వాడి శారీరకఆరోగ్యం పాడవుతుంది. మీకు ఇష్టమైన దైవాన్ని పూజించుకోండి కాని ద్వేషం మటుకు పనికిరాదు అని చెప్పాడు.

కర్మను యోగంగా చెయ్యాలి, కర్మను యోగంగా చేసేవాడే సన్యాసి, వాడే యోగి అని పరమాత్మ చెప్పాడు. భగవంతుని యందు ప్రేమ లేకుండా, ఆయన మీద భక్తిలేకుండా భగవంతుని యందు మన మనస్సును నిలబెట్టలేము. మా మనస్సు భగవంతుని యందు నిలబడటంలేదు అని చాలామంది చెపుతారు. మన మనస్సు భగవంతుని మీద నిలబడక పోవటానికి మమకారం కారణం. మమకారం ఉన్నంతకాలం మోక్షం పొందటానికి అర్హత రాదు. మమకారం వలన భగవంతుడి యొక్క ఔన్నత్యం మనకు తెలియటంలేదు. భగవంతుడి యొక్క వైభవం మీకు తెలియకుండా, ఆయన యొక్క కళ్యాణగుణాలు మీకు తెలియకుండా, భగవంతుడిలో ఉన్నటువంటి శాంతి, సుఖం, జ్ఞానం మీకు తెలియకుండా, భగవంతుడి గురించి శ్రవణం చేయకుండా ఆయన మీద మీకు అసలు ప్రేమ కలుగదు. భగవంతుడి మీద మీ మనస్సు నిలబడటం లేదు అంటే అసలు భగవంతుడి గురించి మీరు ఎప్పడైనా శ్రవణం చేసారా? మీకు భగవంతుడి మీద ప్రేమ లేనప్పడు ఇంక మీ మనస్సు ఆయన మీద ఏమి నిలబడుతుంది. మనందరకు సబ్జక్టు అర్థంకాకపోవడానికి, మనం పాడైపోవడానికి రాగద్వేషాలే కారణం.

భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. అది మనకు తెలిసినా, తెలియకపోయినా మనందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడు. అది తెలుసుకొన్నవాడిని ఋషి అంటున్నాము. తెలియని వాడిని పామరుడు అంటున్నాము. ఆ పామరుడి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు కాని అది వాడికి తెలియటంలేదు, అది తెలుసుకోవటమే మన లక్ష్యం. అది తెలిస్తే మనం సుఖపడతాము, తెలియకపోతే ఆజన్మకు ఆజన్మ దుఃఖం మనలను వెంటాడుతుంది. భగవంతుడు సత్యాన్ని చూస్తూ ఉంటాడు. ఏదైనా తప్ప చేసినప్పడు మనం వాడిని కోర్టుకు తీసుకొనివెళ్ళి వాడికి వేయించే శిక్ష కంటే ఈశ్వరుడు వేసే శిక్ష చాలా సివియర్‌గా ఉంటుంది. ఆయన తీర్పు ఇవ్వడానికి కొంచెం లేట్ చేస్తాడు, ఈలోపుగా మనకు సహనం సరిపోదు. ఒక భక్తుడితో ప్రభువు ఏమన్నాడు అంటే నువ్వు చాలా భక్తిగా ఉంటున్నావు, నీ భక్తికి సంతోషిస్తున్నాను, రేపు వచ్చి కనిపిస్తాను అని చెప్పాడు. ఆ భక్తుడి పని ఏమిటి అంటే చెప్పలు బాగా కుడతాడు. వాడు ఏ ఉద్యోగం చేస్తున్నాడు

అనేది భగవంతుడు చూడడు, చేసే పని ఎలా చేస్తున్నాడు అనేది భగవంతుడు చూస్తాడు, దానిని బట్టే ఆయన దయ మనకు కలుగుతుంది. మరుసటిరోజున భగవంతుడు బాలుడిరూపంలో, మధ్యవయస్సు ఉన్నరూపంలో, వృద్ధుడిరూపంలో ఆ భక్తుడి దగ్గరకు వచ్చాడు. ముందుగా బాలుడి రూపంలో వచ్చి నా చెప్పలు పాడైపోయినాయి, కుట్టిపెట్టు అన్నాడు. నాకు దేవుడు కనిపిస్తాను అన్నాడు, ఆయనకోసం ఎదురుచూస్తున్నాను, నువ్వు వెళ్ళిపో అని ఆ భక్తుడు చెప్పాడు. తరువాత మధ్యాహ్నం మధ్యవయస్సు ఉన్నవాడి రూపంలో వచ్చి చెప్పలు బాగుచేయమని అడిగాడు. నేను భగవంతుడి కోసం ఎదురుచూస్తున్నాను, నీచెప్పలు ఇప్పడు బాగుచెయ్యను అని చెప్పాడు. సాయంత్రం వృద్ధుడిరూపంలో వచ్చాడు. నాకు ఈ రోజు దేవుడు కనిపిస్తాను అనిచెప్పాడు. నేను చెప్పలు కుట్టే పనిలో ఉంటే ఆయన వచ్చి వెళ్ళిపోతాడు అందుచేత నీ చెప్పలు ఇప్పడు కుట్టను వెళ్ళిపో అన్నాడు. మరుసటి రోజు దేవుడు కనిపించాడు. ఏమయ్యా నిన్న కనిపిస్తాను అని చెప్పావు కనిపించలేదు ఏమిటి అని భక్తుడు అడిగాడు. నిన్నే మూడురూపాలలో నీ దగ్గరకు వచ్చాను. నువ్వు గుర్తించలేదు. దేవుడు అంటే ఏదో ప్రత్యేక రూపంలో ఉంటాడు అనుకొంటున్నావు. నిన్న బాలుడిగా, మధ్యవయస్కుడిగా, ముదుసలిగా వచ్చినవాడిని నేనే. అందరి హృదయాలలో దేవుడు ఉన్నాడు అనే గుర్తింపు నీకు లేదు. దేవుడు అనేవాడిని ప్రత్యేకంగా ఒక రూపానికో, ఒక నామానికో బంధిస్తున్నావు. దేవుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, ఆయన సర్వజ్ఞుడు, ఈ ప్రపంచాన్ని అంతా నియమించేవాడు ఆయనే, ఆయన లేనిచోటు అంటూ లేదు అని వివరంగా చెప్పాడు. నిర్గుణం గురించి, నిరాకారం గురించి నీకు తెలియటంలేదు. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడిని ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేయటం అనేది ఆయనను అగౌరవపరచటం అని చెప్పాడు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఒకమాట చెపుతాను. మనలో అంతర్యామిగా ఉన్నవాడే నిజం. బయట ఉన్న గుళ్ళు, గోపురాలు యివన్నీ మన మనస్సు కల్పించిన విషయాలే.

మన కాళ్ళకు తొడుక్కొనే చెప్పలు ఎటువంటివో డబ్బు కూడా అటువంటిదే అని బాబాగారు చెప్పారు. అలా ఎందుకు చెప్పారంటే మనం చెప్పలు కొనుక్కొనేటప్పడు అవి మనకాలుకు సరిపోతాయా లేదా అని చూసుకొంటాము. ఆది సరిపోకపోతే అవి మన కాలుకు పట్టవు. కాలు చిన్నది అయిపోయి చెప్పలు పెద్దవి అయిపోతే వాటితో నడిచేటప్పడు మనం పడిపోతాము. అలాగే మీకు ఉన్న డబ్బు మీ సంసారం నడవటానికి సరిపోకపోతే మీరు బాధపడతారు. మీ సంసారం నడవటానికంటే మీకు ఉన్న డబ్బు ఎక్కువ అయిపోయింది

అనుకోండి అక్కడనుండి భోగాలు అనుభవించాలనే బుద్ధి కలుగుతుంది. ధనం పెరుగుతూ ఉంటే మదం పెరుగుతుంది, దేహభావన పెరుగుతుంది. డబ్బు బాగా పెరిగితే అది ఏమి చేసుకోవాలో తెలియక బజారులో పడి భోగానికి పనికి వచ్చే సామాగ్రి అంతాకొని, ఆ భోగాలు అనుభవిస్తూ రోగాలు తెచ్చుకొని చివరకు పూర్తిగా పతనమైపోతారు. మన కాళ్లకు సరిపడా జోడు ఉంటేనే మనకు సుఖం. అలాగే మనకు డబ్బు ఎక్కువ అవ్వకుండా, అలాగని డబ్బు సరిపడక ఇబ్బందులు పడకుండా సామాన్యంగా ఉంటేనే మనం సంతోషంగా జీవించగలము. ద్వేషం ఉన్నవాడు, కాంక్ష ఉన్నవాడు సన్యాసి అవ్వలేడు, వాడు ఎర్ర బట్టలు కట్టుకొన్నా సన్యాసి కాలేడు. మీరు తెల్ల బట్టలు కట్టుకొన్నా యోగి అవ్వవచ్చు. అది మనస్సును, యింద్రియాలను నియమించుకోవటంలో ఆయోగస్థితి మీకు వస్తుంది కాని బట్టలు మార్చుకోవటం వలన కాదు. డబ్బు ఉన్నవారు కంఫర్ట్సు ఎక్కువ పెంచుకొంటారు. మన మనస్సును కంట్రోలు చేసుకోవటం వలన వచ్చే ఆనందం కంఫర్ట్సు వలన రాదు. మీకు ఏదైనా కోరిక వచ్చినప్పుడు ఆకోరికను సంతృప్తి పరిస్తే అది పెరిగిపోతుంది. సంతృప్తి పరచిన కోరిక యింకో కోరికను తీసుకొని వస్తుంది. అందుచేత కోరికను సంతృప్తి పరిస్తే అది పెరిగిపోతుంది. దానిని కంట్రోలు చేయటం వలన మీరు శాంతికి వారసులు అవుతారు.

మనం నిదానంగా జీవించలేకపోవటానికి, మనకు సబ్జక్టు సరిగా పట్టకపోవటానికి రాగద్వేషాలు కారణం. మీరు రాగద్వేషాలు వదిలేసి ఒకరోజు గడిపితే అది మీకు తెలుస్తుంది. మీకు ఎక్కడా యిష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి, ఇంక మీమనస్సును కదలమన్నా అది కదలదు. మీమనస్సు ఒక వస్తువుమీదగాని, ఒక వ్యక్తిమీదగాని వాలుతోంది అంటే అక్కడ మీకు మమకారం ఉంది. మనస్సు యొక్క చలనానికి ఎటాచ్‌మెంట్ కారణం, అదే మీకు సమస్యలను తీసుకొని వస్తుంది. కొన్ని ప్రాంతాలలో కక్షలు ఎక్కువగా ఉంటాయి. ఎవరైనా వారిని చంపుతారని అనుమానం వస్తే ముందుగా వీళ్లే వెళ్లి వారిని చంపేస్తారు. అలాగే రాగద్వేషాలు మనలను చంపకముందే మనం వాటిని చంపేయాలి. రాగద్వేషాలను మనం చంపము అనుకోండి అవి మనలను చంపేస్తాయి అందుచేత అవి మనలను చంపకముందే మనం వాటిని చంపేస్తే మనం ఆనందంగా ఉండవచ్చు.

మనస్సు యొక్క చలనాన్ని ఆపు చేయటానికి జపం చేయమని, ధ్యానం చేయమని మన సాంప్రదాయంలో చెప్పారు. మీరు జపంచేసి, ధ్యానంచేసి మనస్సును ఎంతకాలం ఆపుచేస్తారు. అసలు మనస్సుకు చలనం ఎందుకువస్తోంది. మీకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి అసలు మీ మనస్సును కదలమన్నా అది కదలదు. యింక ఈజపాలు,

ధ్యానాలు ఎందుకు? అసలు ఈజపం చేసే జపి ఎవడు అంటే అదే మనస్సు, దానికే ఈ రాగద్వేషాలు. అందుచేతనే మీమనస్సును మీరు బాగుచేసుకోండి అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీ మనస్సును బాగుచేసుకోవటానికి, మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి కృషి చేయండి. ఎవరోవచ్చి మీ మనస్సును బాగుచేస్తారని, మిమ్మల్ని ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు. మన శరీరంలో చాలా యింద్రియాలు ఉన్నాయి, అన్ని ఇంద్రియాలు మనస్సును బాహ్యముఖానికి తీసుకొని పోతాయి. ఇంద్రియాలను కంట్రోలు చేయాలంటే మీరు ప్రయత్నం చేసినా ఈశ్వరానుగ్రహం ఉండాలి. కేవలం మనం చేసే సాధన వలన మనస్సు కంట్రోలు లోనికి రాదు. ఈశ్వరానుగ్రహం అవసరం. అనుగ్రహానికి అంతా సాధ్యమే, దానికి అసాధ్యమంటూ ఏమీ లేదు. రాగద్వేషాలను బయటకు తోలేస్తే మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు అంతర్ముఖమైనవాడిని ప్రారబ్దం కూడా ముట్టుకోదు అంటే ప్రారబ్దం యొక్క ప్రభావం వాడిమీద ఉండదు. మీకు ఆత్మానుభవం కలిగితే సంచితం, ఆగామి అనుభవించనక్కరలేదు కాని ప్రారబ్దాన్ని అనుభవించాలి అని శాస్త్రంలో చెపుతారు. ప్రారబ్దం కూడా అనుభవించనక్కరలేదు అంటే పుట్టినదానికి ప్రారబ్దం కాని పుట్టని దానికి ప్రారబ్దం అంటూ ఏమీ లేదు మనం పుట్టిన దానితో తాదాత్మ్యం పొందుతున్నాము. అందుచేత ఈగొడవ అంతా వస్తోంది. మనం పుట్టని వస్తువుతో తాదాత్మ్యం పొందాలి అప్పుడు ఏగొడవ లేదు.

అన్ని కాలాలలో, అన్ని ప్రదేశాలలో, అన్ని అవస్థలలో ఏదైతే అంతటా వ్యాపించిఉందో దానినే మన వేదాంత శాస్త్రంలో బ్రహ్మపదార్ధం అంటారు. ఆ బ్రహ్మపదార్ధము మీరు తెలుసుకొనేది కాదు, అది తెలియబడేది, దానిమీద మీకు సజీవమైన విశ్వాసం ఉండాలి. లోపల ఉన్న సద్వస్తువు అది మీకు ఎప్పుడు తెలియబడాలో అదే నిర్ణయిస్తుంది కాని మనం అనుకొంటే అది తెలియబడదు. దేహం చనిపోయిన తరువాత మనం ఉండము అని అనుకొంటున్నాము, అందుచేత మరణం అంటే అందరికీ భయం. మనందరికి ఉండాలని ఉంది కాని చనిపోవాలని ఎవరికీ లేదు. ఉండాలని ఉండటం న్యాయమే ఎందుచేతనంటే మన స్వరూపం ఉండటమే. ఆ ఉండే వస్తువు సుఖస్వరూపం, శాంతిస్వరూపం, ఆనంద స్వరూపం. నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను అని బైబిలు చెప్పింది. నేను ఉన్నాను అని మనం చెపుతున్నాము కాని ఆ ఉండే వస్తువు నేనై ఉన్నాను అనే అనుభవం మనకు లేదు. దానికి గురువు సహాయం అవసరం. మనకు రాగద్వేషములు ఉన్నప్పుడు మనం చేసే సాధనలు సక్సెస్ అవ్వవు, మనం ఏదైనా పుస్తకం చదివినా అది మనకు సరిగా అర్ధం కాదు. బుద్ధుడు స్వతంత్రుడు. మనం ఏదైతే గ్రంధాలను ప్రమాణంగా తీసుకొన్నామో ఆయన

వాటిని ప్రమాణంగా తీసుకోలేదు. నీ అనుభవంతో ముందుకు వెళ్ళు అని చెప్పాడు. మనం ఏదైనా తప్పు చేసినప్పుడు అది తప్పు అని మన బుద్ధి చెపుతుంది. మనం ఎంతసేపు మనస్సు చెప్పింది వింటాము గాని బుద్ధి చెప్పింది వినము. మనస్సు ఆలోచిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. అప్పుడు మనం బుద్ధిని అనుసరిస్తే మనం బాగుపడతాము. ఎప్పుడైతే మనకు విచక్షణా జ్ఞానం పోయిందో, వివేకం ఎప్పుడైతే పోయిందో అప్పుడు మనస్సు మనమీద పెత్తనం చేస్తుంది. శరీరం చనిపోవటం అనేది సహజం. శరీరం చనిపోయేటప్పుడు చావని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు, దుఃఖం లేదు, అది లేదా అంటే అది ఉంది. లోపల ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అది ఉండటం వలనే అది మీకు తెలియబడుతూ ఉంటుంది కాని దానిని చూపించటానికి రెండో వస్తువు అక్కరలేదు. మనం అమృతానుభవం పొందాలి అంటే యిప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేనుకు ఆహారం అందకుండా చూసుకోవాలి అంటే ఆ నేనుకు ఫుడ్ సప్లయిని కట్ చేయాలి.

నన్ను సంతోషపరిచే పనులు చెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు. దానివలన నువ్వు కానిదానితోటి విడిపోవటం నేర్చుకొంటావు. ఇప్పుడు నువ్వు కానిదానిని నువ్వు అనుకొంటున్నావు. నాకు ప్రీతి అయిన పనులు చేస్తూఉంటే నువ్వు కాని శరీరంతోటి, నువ్వు కాని మనస్సు తోటి సెపరేట్ అవ్వటం నెమ్మదిగా అలవాటు అయిపోతుంది. సర్వసాధారణంగా మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తిపరుచుకోవటానికే పనిచేస్తాడు. మనిషికి కొంత ఏకాంతవాసం అవసరం. మీ ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చుని ఆలోచించండి. మనిషి వాడి అవసరాలు తీరిన తరువాత కూడా వాడి అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవటానికి పనులు చేస్తూ ఉంటాడు. అలాకాదు నన్ను సంతోషపెట్టేపనులు చేయండి అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ పని చేస్తే ఈశ్వరుడు సంతోషిస్తాడు అని ఆ విచక్షణ జ్ఞానం పెంచుకొని నా కోసం మీరు పని చేస్తూ ఉంటే నా అనుగ్రహానికి మీరు పాత్రులవుతారు.

నన్నే గమ్యంగా పెట్టుకో అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు అనేక పనులు చేసుకొంటూ ఉంటారు. మీరు ఏదైనా ఒక పని చేసేటప్పుడు, ఒక మాట మాట్లాడేటప్పుడు నీ హృదయంలో ఏ ప్రేరణవలన ఆ పని చేసావు, ఏ ప్రేరణ వలన నీకు ఆమాట వచ్చింది అది భగవంతుడు చూస్తాడు, దానిని బట్టి నీకు స్పిరిట్యువల్ స్టేటస్ ఇస్తాడు. నీ వృత్తిధర్మం ఏదో నువ్వు చేసుకొన్నప్పటికీ నీ హృదయంలో మటుకు భగవంతుడినే గమ్యంగా పెట్టుకోవాలి. భగవంతుడిని ప్రేమించు, ఆయన యందు భక్తి కలిగి ఉండు. ప్రపంచంతోటి మనం అతిగా

ఉండకూడదు ఇప్పుడు మనందరం ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నాము, భగవంతుడికి దూరంగా ఉంటున్నాము. ఈ సమాజంతో ఎంతవరకు సంబంధం అవసరమో అంతవరకే సంబంధం పెట్టుకోవాలి కాని నువ్వు అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే నీకు అహంకారం పెరిగిపోతుంది, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మరిచిపోతావు. అందుచేత ప్రపంచంతోటి నీకు ఉన్న సంఘబుద్ధిని తగ్గించుకో. సోమరితనం వద్దు, శరీరయాత్రకు సరిపడ పనిచేసుకో. సమాజంతో అతిగా ఉంటే నీ స్వరూపానికి దూరమవుతావు. ఏ ప్రాణికోటితోటి వైరం పనికి రాదు. ఎందుచేతనంటే మీకు ఎవరిమీద అయితే వైరం ఉందో వాడే అస్తమానూ జ్ఞాపకం వస్తాడు కాని ఇంక భగవంతుడు మనకు జ్ఞాపకం రాడు. మనకు ఎవరైనా అపకారం చేసినా దానికి ఏదైనా పరిష్కారం ఉంటే పరిష్కారం చేసుకోవచ్చును కాని వైరం పెట్టుకోవద్దు. కొంతమందికి దీర్ఘకాలం కోపం ఉంటుంది, అది మంచిది కాదు. సత్పురుషుడికి కూడా ఎప్పుడైనా కోపం వస్తుంది అది నీటిమీద గీతలాంటిది. నీటిమీద గీతగీస్తే ఎంతసేపు ఉంటుందో సత్పురుషుడికి వచ్చేకోపం కూడా అలాగే ఉంటుంది. నీకు ఎవరిమీద ద్వేషం పనికిరాదు, వైరం పనికిరాదు. ద్వేషబుద్ధిని, వైరబుద్ధిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

నువ్వు ఏదైనా మాట్లాడితే నాకు సంబంధించిన మాటలే మాట్లాడాలి. నువ్వు ఏదైనా పనిచేస్తే నా అనుగ్రహం సంపాదించుకొనే పనులుమాత్రమే చెయ్యాలి. నువ్వు చిరకాలం, కలకాలం నాకు భక్తుడిగా ఉండు. నువ్వు స్వతంత్రుడవు అయిపోకు. బాహ్య పరిస్థితులను చూసుకొని, మీకు ఉన్న అధికారాన్ని, డబ్బును చూసుకొని, లేనిపోనివి ఏవో కల్పించుకొని, బయటగొడవలు అన్నీ నెత్తిమీద పెట్టుకొని మేము పెద్దవాళ్ళము అయిపోయాము అని అనుకోవద్దు. ఈ మధ్య అందరికీ పెద్దరికాలు అంటే ఇష్టంగా ఉంది. ఒకవేళ మనం మంచి పనులు చేస్తున్నా మాతోటి చెప్పకుండా ఎందుకు చేస్తున్నారు అని అడుగుతున్నారు. ఎవడికి పెద్దరికం ఇవ్వకపోతే వాడికి కోపం. మనం వినయంగా ఉండి, భగవంతుడు చెప్పినట్లుగా నడుచుకోవాలి కాని నేను ఏదో పెద్దవాడిని అయిపోయాను అని మనలో మనం ఊహించుకోకూడదు. భగవాన్ తల్లికి ఏమని చెప్పారంటే జరగవలసింది జరిగేతీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఈ సృష్టి అంతా ఈశ్వర సంకల్పంతోటి నడుస్తోంది. శక్తి నీది కాదు, శక్తి ఈశ్వరుడిది. నాకు కోరిక ఉంటే ఆ ఫలితం వస్తుంది, కోరిక లేకపోతే ఫలితం రాదు అనుకొంటున్నావు. కోరికకు శక్తిలేదు. శక్తి ఈశ్వరుడిది. నీకురావలసింది నీ సంకల్పం లేకపోయినా వచ్చి నీ నెత్తిమీద పడుతుంది. నీకు భగవంతుడు ఏదైతే ఇవ్వకూడదు అనుకొన్నాడో దానిమీద నువ్వు ఎంత మనస్సు

పెట్టినా, దానికోసం ఎంత ప్రయత్నం చేసినా అదిరాదు. వచ్చేదేదో వస్తుంది, రానిదేదో రాదు. మనం కోరుకోకుండా వచ్చింది స్వీట్‌గా ఉంటుంది, అది నిన్ను బంధించదు. కోరికతో తెచ్చుకొన్నది మనిషిని బంధిస్తుంది.

నీకు ఏదైనా వస్తే అది ఈశ్వరానుగ్రహం వలన వచ్చిందే, అది ఈశ్వరుని ప్రసాదమే. అందుచేత ఏదీ నీ సొంతం అనుకోవద్దు. నీ దగ్గర పదిరూపాయలు ఉన్నా దానికి ఓనర్ ఈశ్వరుడే కాని నువ్వు కాదు. ఈ లోకానికి కర్త ఎవరు అంటే ఈశ్వరుడే కర్త అయితే నేను కర్తను అని నువ్వు అనుకొంటున్నావు అందుచేత నీకు దుఃఖం వస్తోంది. సబ్జక్టు నీకు సరిగా అవగాహన కాకపోవటం వలన నువ్వు సాధనచేసినా దుఃఖరహితస్థితిని పొందలేక పోతున్నావు. అనుకొనేది అంతా మనస్సు సకల్పం, జరిగేది అంతా ఈశ్వరసంకల్పం అని నోటితో చెప్పటం కాదు, అది మీకు అనుభవంలోనికి రావాలి. కొన్ని విషయాలు మన యింద్రియాలకు అందవు, మనస్సుకు అందవు, అనుభవానికి అందుతాయి. అందుచేత అనుభవం వచ్చేవరకు కొన్ని విషయాలు మనకు అర్ధంకావు. జరిగేది అంతా ఈశ్వర సంకల్పం అనేటటువంటి ఈ వాక్యం నీ రక్తంలో కలిసిపోతే అప్పడు సుఖం నీకు తెలుస్తుంది, దుఃఖస్పర్శ లేని స్థితిని పొందుతావు. ఈ ప్రపంచంలో ఉన్న మనుషుల మీదకాని, వస్తువుల మీదకాని ఆధారపడకుండా స్వతంత్రమైన సుఖం, ఆనందం మీకు అనుభవంలోనికి వస్తే ఇంకమీకు పునర్జన్మ లేదు. ఎందుచేతనంటే ఇంక మీకు శరీరంతో పనిలేదు. శరీరం అవసరం లేకుండా నువ్వు పొందవలసిన ఆనందం పొందుతున్నావు కాబట్టి ఇంక నీకు పునర్జన్మ రాదు. ప్రాణంపోయే చివరి టైములో నీకు పునర్జన్మ వస్తుందో, రాదో నిర్ణయింపబడుతుంది. ముగింపులేని సుఖం, ముగింపులేని ఆనందం అది నువ్వు చివరి టైములో ఎంజాయ్ చేయగలిగితే యిదే నీకు చివరిజన్మ, ఇంక నీకు పునర్జన్మ లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-05-2012, ఖండవల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భీష్ముడు మహాజ్ఞాని, భక్తుడు, మహావీరుడు, మహాబలవంతుడు. ఒక చిన్నమాట పోషించుకోవటానికి జీవితం అంతా బ్రహ్మచర్యం అవలంబించినవాడు. అంత మహాజ్ఞాని కూడా అధర్మపక్షంలో ఉన్నాడు. ధర్మం ఎక్కడ ఉందో, న్యాయం ఎక్కడ ఉందో ఆయనకు తెలుసు. కానీ దేహప్రారబ్దం తప్పించటం కష్టం. ప్రారబ్దం చాలా బలీయమైనది. ఆ ప్రారబ్దం వలన ఆయన అధర్మపక్షంలో ఉండవలసివచ్చింది. ఆయనని ఎవరూ చంపలేరు. కాని

పాండవులు వెళ్ళి నువ్వు చనిపో అని అడిగితే చనిపోయాడు. భీష్ముడు ప్రాణప్రయాణ టైములో కృష్ణా, కృష్ణా అంటూ చివరి శ్వాస విడిచిపెట్టాడు. ప్రారబ్దానికి రమణమహర్షిగారు ప్రాముఖ్యత ఇవ్వలేదు. మంచి ప్రారబ్దం అయినా, చెడ్డ ప్రారబ్దం అయినా దేహానికే కదా! ఆ దేహం నువ్వుకాదని తెలిసినప్పుడు ఏ ప్రారబ్దం అయినా నిన్నేమీ చెయ్యదు. మనస్సు అంతర్ముఖమైన వాడిని ప్రారబ్దం ఏమి చేస్తుంది.

నాస్తికులు ఎక్కువగా మన మతం కంటే బౌద్ధమతాన్ని ఇష్టపడతారు. బుద్ధుడికి దేవుడు ఉన్నాడా లేడా అని సమస్యకాదు. దేవతల తోటి సంబంధం లేకుండా, మధ్యవర్తుల తోటి సంబంధం లేకుడా నిన్ను డైరక్టుగా పూర్ణస్థితికి తీసుకువెళ్ళటానికి, జననమరణరహిత స్థితికి నిన్ను తీసుకువెళ్ళటానికి ప్రయత్నం చేశాడు బుద్ధుడు. ఆ ప్రయత్నం ప్రపంచంలో ఎక్కువ మందిని ఆకర్షించింది. బుద్ధుడు ఒక మహారాజ్యాన్ని విడిచిపెట్టాడు, ఇంత పెద్దరాజ్యాన్ని నేను విడిచిపెట్టేశాను అనే తలంపు కూడా ఆయనకు ఎప్పుడూ రాలేదు. ఆకర్షణ అంటే రాగం (ఇష్టం), వికర్షణ అంటే ద్వేషం (అయిష్టం). ఈ రెండింటి వల్లే మీరు లోపల ఉన్న నిర్వాణస్థితిని పొందటం లేదు అన్నాడు బుద్ధుడు. ఈ రాగద్వేషాలే మన పునర్జన్మలకి కారణం. ఆకర్షణ, వికర్షణ ఈ రెండింటి మధ్యన మన మనస్సు తిరుగుతూ ఉంటుంది. బుద్ధుడు ఏమని చెప్పాడంటే ఏ దేశమెళ్ళి చూసినా, ఏ ప్రాంతం వెళ్ళి చూసినా, ఎవరింటికి వెళ్ళి చూసినా రాగద్వేషాలు తప్పించి ఈ ప్రపంచంలో ఇంకేమీ లేవు అని చెప్పాడు. మనకి భగవంతుడు కాళ్ళు, చేతులూ ఎలాగ ఇచ్చాడో అలాగే తలకాయ కూడా ఇచ్చాడు. అందుచేత మనం ఏదైనా పుస్తకం చదివినా, ఎవరైనా ఏదైనా చెప్పినా అది మన సొంతబుద్ధితో ఆలోచించుకోవాలి. మనకి భగవంతుడు బుద్ధిని ఎందుకు ఇచ్చాడు? సొంతంగా ఆలోచించుకోమనే బుద్ధిని ఇచ్చాడు. లేకపోతే మనకి బుద్ధి ఎందుకు? మనం గొఱ్ఱెలం కాదుకదా మనం మనుషులం. మాట్లాడేశక్తి, ఆలోచించేశక్తి ఇతర జంతువులకంటే మనకి బహుమతిగా భగవంతుడు ఇచ్చాడు. జంతువులు మాట్లాడలేవు, ఆలోచించలేవు కనుక వాటికి అనుకరణ ఎక్కువ ఉంటుంది. అలాగే మనకి అనుకరణ ఉంటే ఇంక బుద్ధి ఎందుకు? మనం స్వతంత్రంగా ఆలోచించుకోవాలి. మన బుద్ధిని సోమరితనంగా ఉంచకూడదు. కృష్ణుడు భగవద్గీతని చెబుతూ అర్జునా నేను చెబుతున్నాను, నువ్వు కూడా ఆలోచించుకో అని చెబుతాడు. నీకు అది మంచి అనుకుంటేనే ఆచరించు, నీకు ఇష్టంలేకపోతే వదిలేయమని చెబుతాడు. ఇక్కడ ఫ్రీడం ఇచ్చాడు. కైకకి ఇతరుల చెప్పుడు మాటలు వినటం వల్ల పరాయి బుద్ధి వచ్చింది. కైక అంత దుఃఖపడటానికి పరాయిబుద్ధే కారణం. ఎప్పుడూ మన సొంత

బుద్ధి మనల్ని సుఖపెడుతుంది. పరాయిబుద్ధి దుఃఖపెడుతుంది.

భగవద్గీత సమగ్రమైన గ్రంథం. సంసారంలో ఉన్న కష్టసుఖాలు మొదలు ఆత్మజ్ఞానం వరకూ మనం ఎలా గ్రాడ్యువల్‌గా గ్రోత్ ఎలా పెంచుకొంటూ రావాలి, వికాసం ఎలా పెంచుకుంటూ రావాలి అని ఇలా స్టెప్ బై స్టెప్ వరుసగా చెప్పకుంటూ వస్తాడు. ఋషులు అలాకాదు వాళ్ళు దర్శించినవి చెప్పారు. కానీ ఈయన భగవంతుడు. భగవంతుడికి అందరూ సమానమే. జీవకోటి అందరూ ఆయన బిడ్డలే. అందుచేత అందరికీ ఉపయోగపడే మాటలే చెప్పాడు. ఏది ఆచరించాలి, ఏది ఆచరించకూడదు ఇది నువ్వు శాస్త్రాన్ని బట్టి చూచుకో అన్నాడు. గీతలో మనం చేయదగిన పనులు చెప్పాడు, చేయకూడని పనులు చెప్పాడు. నువ్వు చేసే కర్మలు సాత్వికంగా ఉండాలి. మీరు ఒక మంచి పనిచేస్తే ఆ మంచి పని పబ్లిసిటీ కోసం కాకుండా, ఇతరుల మెప్ప కోసం కాకుండా, భగవంతుడు మనకి ఏదో బహుమానం ఇస్తాడని తలంపుతోటి కాకుండా, మంచిపని కూడా నిష్కామభావనతోటి, నిష్కామభక్తి తోటి చేస్తే దానివలన సత్వగుణం అభివృద్ధి అవుతుంది. సత్వగుణం మోక్షానికి వెళ్ళటానికి దారి చూపిస్తుంది.

మనం మాయ ఎక్కడో ఉంది అనుకుంటాం. మాయ అంతా మనలో గుణాల రూపంలో ఉంది. మనకి రోగాలు ఉంటే బాడీ స్కానింగు ఎలా తీస్తారో అలాగ మన లోపల ఏ గుణాలు ఉన్నాయి, ఆ గుణాలు ఎలా పని చేస్తున్నాయి అని చూచుకుంటూ ఉండాలి. ఇష్టాలు, అయిష్టాలు మీ మనస్సులో వచ్చే వికారాలు అని కృష్ణుడు అన్నాడు. మనస్సులో మీకు ఏదైనా ఉద్రేకం వచ్చినప్పడు ఇష్టాలు, అయిష్టాలు పుడతాయి. బ్రహ్మనిర్వాణం అంటే మోక్షం. అది ఎవరికి లభిస్తుంది? స్త్రీలకి లభిస్తుంది, పురుషులకి లభిస్తుంది అని లేదు, హిందూమతానికి, క్రైస్తవ మతానికి లభిస్తుంది అని లేదు. అక్కడ కులం గాని, మతం కాని ఏమీ భేదం లేదు. స్త్రీలా, పురుషులా అనేటటువంటి భేదం లేదు. క్షీణకల్మషాః కల్మషం అంటే పాపం, దోషం. మీలో ఏమైనా దోషాలు ఉంటే, ఎవరి దోషాలు వారికి తెలుస్తూ ఉంటాయి. ఎవడైతే తన మనస్సులో ఉన్నటువంటి, తన ఇంద్రియాలలో ఉన్నటువంటి కల్మషాలన్నీ పూర్తిగా శేషం లేకుండా తొలగించుకున్నాడో అంటే వాడిని బహిర్ముఖం చేసే వాసన ఒకటి కూడా లేదో వాడికి బ్రహ్మనిర్వాణం లభిస్తుంది. మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి దేహం వచ్చిందంటే దుఃఖం తప్పదు. వారేదో దుఃఖంలో ఉన్నారు. మనకు ఏమీ దుఃఖం లేదని అనుకోకండి. మీకు దుఃఖాలు వాయిదాలు పడుతున్నాయి. మీకూ దుఃఖం వచ్చేస్తుంది. జీవలక్షణాలు ఉన్నంతసేపు దుఃఖం లేకుండా మనిషి ఉండడు. ఎక్కడైతే దుఃఖం లేదో ఆ స్థితిని పొందటమే

ఆత్మజ్ఞానం. మీకు సంశయాలు ఉండకూడదు. సబ్జక్టులో క్లారిటీ ఉండాలి. మనం దేనినైతే పొందుదాం అనుకుంటున్నామో దాని తాలూకు స్పష్టత రావాలి. భగవంతుడు లేడని పదిమంది చెబితే అదే నిజం అనుకుంటారు. పదిమంది కలిసి దేవుడు ఉన్నాడు అని చెబితే అది నిజం అనుకుంటారు. ఎందుచేతనంటే మీకు సొంత ఆలోచన లేదు, ఒక అవగాహన లేదు. అలా ఎటు గాలి వీస్తే అటు వెళ్ళిపోయేలాగ ఉండకూడదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ఒక ధృఢమైన విశ్వాసం మీకు ఉండాలి. దానిని ఎవరూ కదపకూడదు. నిప్పని ముట్టుకుంటే కాలదు అని చెబితే మీరు ఎవరైనా నమ్ముతారా? నిప్ప కాలుతుంది అని మీ అనుభవం. అలాగే ఆత్మజ్ఞానం తాలూకు అనుభవం వచ్చాకే అది లేదని చెప్పినా వాడికేమీ అనిపించదు. అది ప్రత్యక్షానుభవం. మనం ఇప్పుడు నేను అంటున్నాం కదా! ఈ నేను ఎంత డైరెక్టుగా మనకి అనుభవంలో ఉందో అలాగ మన లోపల ఉన్న నిజం కూడా అంత డైరెక్టుగా మనకి అనుభవంలోనికి రావాలి. అది జీవిత గమ్యం. మనకి ఇంట్లో ఉన్న దారిద్ర్యం కంటే మానసికదారిద్ర్యం ఎక్కువ బాధపెడుతుంది. మనకి ఇంట్లో దారిద్ర్యం ఉన్నా మానసికదారిద్ర్యం ఉండకూడదు. మానసికదారిద్ర్యం ఉంటే జ్ఞానం రాదు. మానసిక దారిద్ర్యం కూడా ఒక కల్మషమే. మీకు మోక్షం కావాలనుకుంటే మీలో ఉన్న కల్మషాలన్నింటినీ వేరుతో సహా నాశనం చేసుకోవాలి.

బయట ఉన్న దేవాలయాలు, చర్చిలు, మసీదులు ఇవన్నీ మనస్సు కల్పించినవి అవ్వవచ్చు, కానీ హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవంతుడు నూటికి నూరుపాళ్ళు నిజం, భగవంతుడు మన ఆలోచనకి సాక్షి, మన మాటకి సాక్షి, మనచేతకి సాక్షి. భగవంతుడు సర్వసాక్షి. నువ్వు ద్వైతభావన తగ్గించుకో. వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అనే జడ్జిమెంట్లు మనకు అనవసరం. వాడు చెడ్డవాడైతే నువ్వు స్నేహం చేయటం మానేయి. మిగతా విషయాలు నీకు అనవసరం. వాడి గొడవ భగవంతుడు చూసుకుంటాడు. నీ గొడవ ఏదో నువ్వు చూసుకో. ఏ పని మీద నువ్వు ఈ లోకంలోకి వచ్చావో ఆ పని చూసుకో. నీకు చేతనైతే ఇతరులకు సహకరించు. అంతేగాని ఇతరులమీద తీర్పులు చెప్పటం మానేయి. ఇతరుల మీద తీర్పులు చెప్పటం వలన నీ మనస్సులోకి కల్మషం వస్తుంది. చాలామంది మాకు శాంతిగా లేదు అంటారు. ఎక్కడ మనస్సు ఉందో అక్కడ ఆందోళన ఉంటుంది. అశాంతి ఉంటుంది, క్షోభ ఉంటుంది. అసలు మనస్సే అబద్ధం. ఆ మనస్సు చిరిగిపోయేవరకూ ప్రతివాడినీ ఏదోరకమైన అశాంతి వెంటాడుతూనే ఉంటుంది. మనస్సుని బాగుజేసుకోమని ఎందుకు చెప్పారంటే నువ్వు మనస్సుని సంస్కరించుకుంటే అది నీ

హృదయంలో ఉన్నటువంటి సత్యానికి దారి చూపిస్తుంది. మన మనస్సుని మనం బాగుచేసుకోవటం కంటే మించిన పని ఈ సృష్టిలో ఏమీ లేదు. మన మనస్సు పల్చబడుతూ ఉండాలి. అది పల్చబడి, పల్చబడి చిరిగిపోతుంది. ఎప్పుడైతే అది చిరిగిపోయిందో లోపల ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. మనస్సులేని స్థితి మనం పొందేవరకూ మనం శాంతిని పొందలేము. మాకు శాంతి లేదండి అంటారు. శాంతిని సంపాదించటానికి నువ్వు చేసిన కృషి ఏముంది? నీకు ఎక్కడో బంధం ఉంది కాబట్టి అశాంతి వస్తోంది. బంధం లేని వాడికి అశాంతి ఏమిటి? మనస్సు చలిస్తే అశాంతి, మనస్సు చలించకపోతే శాంతి అన్నారు.

యతాత్మనః అంటే సాధ్యమైనంత వరకూ మీ మనస్సునీ, మీ ఇంద్రియాలనీ అదుపులో పెట్టుకోవాలి. నువ్వు పొల్యూట్ అవ్వకూడదు. ముందు తిండి కంట్రోలు ఉండాలి. అన్నం తినేటప్పుడు ఒకటి గుర్తు పెట్టుకోవాలి. మనం తిన్నదంతా మళ్ళీ ఏదో టైములో బయటకి వచ్చేయాలి అనే గుర్తు ఉంటే అన్నం తినేటప్పుడు జాగ్రత్తగా ఉంటారు. అన్నింటికంటే ఆహార నియమం ముఖ్యమైనది. వాళ్ళు ఇలా ఉన్నారు, మనం కూడా ఇలాగే ఉందాం అని అనుకోవద్దు. అనుకరణ మంచిదికాదు. అనుకరణ బలహీనుడి లక్షణం. మీ మనస్సులో బలహీనత ఎక్కువ ఉంటే వాళ్ళు ఉన్నట్టే మనం కూడా ఉందాం అనిపిస్తుంది. మనం మనలాగ బతకాలిగాని వాళ్ళలాగ బతకకూడదు. ఎదుటివాళ్ళని అనుసరించకూడదు. సర్వభూతహితేరతాః అంటే తోటి మానవులు క్షేమంపట్ల నీకు ఆసక్తి ఉంటే నువ్వు పవిత్రుడవు అవుతావు. భౌతికంగా నువ్వు ఇతరులకు ఏమీ చేయలేకపోవచ్చు కానీ వాళ్ళు సుఖంగా ఉండాలి, వాళ్ళు శాంతిగా ఉండాలి అని వాళ్ళ క్షేమం కోరటం వలన నీకు శాంతి కలుగుతుంది, మనస్సు నిశ్చలమవుతుంది, పవిత్రమవుతుంది. ఇంద్రియాలు నీకు స్వాధీనంలోకి వస్తాయి. రజోగుణం తగ్గుతుంది. ఇతరుల క్షేమం కూడా మనం కోరలేని పరిస్థితిలో ఉంటే అది మానసిక దారిద్ర్యం. ఇంట్లో ఉన్న దారిద్ర్యం వలన ఆధ్యాత్మికంగా మనం పాడు అవ్వం, కానీ మానసికదారిద్ర్యం వలన ఆధ్యాత్మికంగా మనం పాడవుతాము. మీరు ఎదుటివాళ్ళకి ఏదైనా మంచి చెబుతున్నారు అనుకోండి వాళ్ళ ఫీలింగ్ హర్ట్ అవ్వకుండా చెప్పాలి. ఉద్రేకం లేకుండా చెప్పాలి. మీరు సబ్జక్టుని ముందు ఎంజాయ్‌చేసి జీర్ణం చేసుకొని వాళ్ళకి చెబితే వాళ్ళకి వినాలనిపిస్తుంది. వాళ్ళు కూడా నేర్చుకుంటారు. అంతేకాని మీకే జీర్ణం అవ్వకపోతే వాళ్ళకి చెప్పినా ప్రయోజనం లేదు. కన్‌ఫ్యూజన్ వచ్చేస్తుంది. మీరు ఎప్పుడైనా సబ్జక్టు రుచి చూసారా? మీరు రుచి చూచి వాళ్ళకి చెబితే, ఆ రుచి ఎంతోకొంత వాళ్ళకి తెలుస్తుంది. అనుభవించి

చెబితే వన్ వర్డ్ ఈజ్ ఎనఫ్. వన్ లుక్ ఈజ్ ఎనఫ్, వన్ టచ్ ఈజ్ ఎనఫ్. బుద్ధుడు ఒక మాట చెప్పాడు. భౌతికమైన వ్యవసాయం చేయటం కంటే ఆధ్యాత్మిక వ్యవసాయం చేయటం కష్టం. నువ్వు చేను ఊడ్చాలంటే ముందు దున్నాలి కదా, నీకు జ్ఞానం రావాలంటే ముందు మనస్సుని సంస్కరించుకోవాలి. నీ బుద్ధిని నిదానంగా పెట్టుకోవాలి అది ఇంకా కష్టం అన్నాడు.

నీకు తెలిసినా, తెలియకపోయినా ఆత్మ నీలో ఉంది. దాని తాలుక ఎరుక నీకు రావాలి. అప్పుడు శరీరం ఉన్నా, శరీరం లేకపోయినా, లోకం కనిపించినా, లోకం కనిపించక పోయినా, నీ శరీరానికి సంబంధించిన చావుతోటి సంబంధం లేకుండా నువ్వు ఆనందంలో, శాంతిలో, కాంతిలో ఊగిసలాడతావు. ఈ స్థితి పొందితే శరీరం పోయిన తరువాత ఆనందం కంటిన్యూ అయిపోతుంది. ఆత్మానుభవంలో శరీరం రాలిపోయినా మీకు దాని వలన ఏదో పోగొట్టుకున్నాం అని అనిపించదు ఎందుచేతనంటే మీరు దేహంతోటి విడిపోయారు. అది ఆత్మ యొక్క వైభవం. యజ్ఞం అంటే మన శరీరయాత్రకి సరిపడి మనం చూచుకుంటూ మిగతాది ఇతరుల క్షేమం కోసం స్వార్థం లేకుండా, అహంకారం లేకుండా, గుర్తింపులతోటి సంబంధం లేకుండా నువ్వు పనిచేస్తే నీకు వచ్చిన ఫలితంలో నేను కూడా భోక్తను, భాగస్వామిని అవుతాను అన్నాడు పరమాత్మ. మీ అబ్బాయి యూనివర్శిటీకి ఫస్టు వస్తే వాడు ఎంత సంతోషిస్తున్నాడో మీరు కూడా అంతే సంతోషిస్తారు కదా అలాగే మీరు చేసే మంచి కర్మలలో నేను కూడా భాగం పంచుకుంటాను, సంతోషిస్తాను అని చెబుతున్నాడు. భగవంతుడు సంతోషిస్తే ఆయన దయకి, ఆయన అనుగ్రహానికి మనం పాత్రులవుతాము. మీరు ఎవరికైనా సబ్జక్టు బోధిస్తున్నారు అనుకోండి ఆ బోధవల్ల వాళ్లకి మోక్షానికి దారి కనపడాలి కాని ఆ బోధ బాధకింద మారకూడదు. మీరు చెప్పే బోధ వల్ల వాళ్లకి ఆనందం రావాలి, శాంతి రావాలి. మీరు సబ్జక్టుని ఎంజాయ్ చేస్తూ చెబితే అందులో వాళ్ళు భాగస్వాములు అవుతారు. అది టీచర్ లక్షణం. బోరన్ టీచర్స్, మేడ్ టీచర్స్ అని ఉంటారు. కొంతమంది ట్రైనింగులు అయ్యి టీచర్స్ అవుతారు వాళ్లని మేడ్ టీచర్స్ అంటారు. బోరన్ టీచర్స్‌కి ట్రైనింగులు అక్కరలేదు. పుట్టుకతోటే టీచర్స్‌గా పుడతారు. ఆ బోర్న్ టీచర్స్ చెబుతూ ఉంటేనే సబ్జక్టు వినాలి. అప్పుడు మీకు సబ్జక్టు మీద ముందు ఇంటరెస్ట్ క్రియేట్ అవుతుంది. ఒకడికి లెక్కల్లో వందకి సున్నా వస్తోందనుకోండి, టీచర్ లెక్కలు బాగా చెప్పగలడు అనుకోండి, ఒక్క సంవత్సరంలో వాడికి వందకి వంద మార్కులు తీసుకురాగలడు. వాడు బోర్న్ టీచర్. అందుచేత ఆచార్యుడు కూడా దైవంతోటి సమానం. జీవుడు శరీరం ధరించి భూమి మీద

పడ్డాక మళ్ళీ ఆ శరీరం స్మశానానికి వెళ్ళే వరకూ ఏ రోజున, ఏ క్షణంలో ఎక్కడ ఉండాలి, వాడు ఏ ప్రారబ్ధం అనుభవించాలి, ఎప్పుడు చనిపోవాలి, ఎప్పుడు పుట్టాలి, ఇదంతా పులిస్టాపు, కామా తేడా లేకుండా క్రమంగా ఆ జీవుడిని వాడి ప్రారబ్ధము ననుసరించి ఎవడైతే నియమిస్తున్నాడో వాడే ఈశ్వరుడు.

కొంతమంది చాలా బేలెన్స్‌డ్‌గా ఉంటారు. వాళ్ళ మైండ్‌లో ఏం జరుగుతోందో వాచింగ్‌లో ఉంటారు. ఎప్పడైనా వాళ్ళకి కోపం వస్తోందనుకోండి ఎందుకు కోపం వస్తోంది అని వాచింగ్‌లో ఉంటారు. కోపం ఉన్నప్పడు మౌనంగా ఉంటే కొంత తగ్గిపోతుంది. ఒక గంట మౌనంగా ఉంటే రజోగుణం మాటలు మాట్లాడము. కోపానికి మౌనమే మందు.

**ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్థమనోగతాన్,**
**ఆత్మన్యేవాత్మనాతుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే. (గీత 2-55)**

ఎవడైతే మనస్సులో ఉన్న కోరికలన్నింటిని సంపూర్ణముగ వదిలిపెట్టి నిర్మల చిత్తముతో నిరంతరము ఆత్మ సంతుష్టిని పొందుచున్నాడో వాడు స్థితప్రజ్ఞుడు. నీ మనస్సులో వాసనలు ఏమున్నాయో నువ్వు చూసుకో. అప్పడు ఒకో వాసనని, ఒకో వాసనని విడిచిపెట్టటానికి ప్రయత్నం చెయ్యి. ఎందుచేతనంటే అది కొన్నివేల జన్మలనుంచి వచ్చే మలదోషం. మనల్ని భగవంతుడు ఏ పని అయితే చేయవద్దన్నాడో ఆ పని కనుక మనం చేస్తే ఈ దోషాలు పెరుగుతాయి. మనకి అవసరాలు కొన్ని ఉంటాయి. మన అవసరాలకి మించి వచ్చే సంకల్పాలన్నీ మనస్సు కల్పించినవే. మీరు శరీరం మెయిన్‌టైన్ అవ్వటానికి తినే అన్నం కోరిక కాదు. మీరు బట్ట చుట్టబెట్టుకోవటం కోరికకాదు, నీడకోసం ఇల్లుకట్టుకోవటం కోరిక కాదు. ఇవి కాకుండా కృత్రిమంగా మీ మనస్సు కొన్ని కోరికలు సృష్టిస్తుంది. అవి ఏవైనా వస్తే మీరు తగ్గించుకోండి. మీకు సంఘటనలు ప్రతికూలంగా ఉన్నా మీ మనస్సు కనుక మీకు స్వాధీనంలో ఉంటే మీకున్న శాంతిని ఎవరూ పాడుచేయలేరు. మీకు దుఃఖం వచ్చినప్పడు ఉద్వేగం పడకండి. అంటే మీకు దుఃఖం రాకముందు ఎలా ఉన్నారో, దుఃఖం వచ్చినప్పడు అలాగే ఉండండి. మీకు సుఖం వస్తుంది. అది సుఖం కాదు. సుఖంలా కనిపించే దుఃఖం. మీకు బయట కారణాల వల్ల కొన్ని సంతోషాలు, సుఖాలు వస్తున్నాయి కదా, మళ్ళీ అవి ఏనాటికైనా మీకు దుఃఖం కింద మారిపోతుంది. వడ్డీతో సహా మీకు అనుభవానికి వస్తుంది. అది చట్టం. మనకు హృదయంలోనుండి వచ్చే స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన శాంతి నిలబడుతుంది.

కొంతమందికి ఊరు దాటి వెళితే నిద్రపట్టదు. ఒక వ్యక్తి మీదకాని, ఒక ప్రాంతం మీదకాని మీరు ప్రత్యేకంగా ఎటాచ్‌మెంట్ పెట్టుకోవద్దు. ఎక్కడా అతిగా స్నేహాలు చేయవద్దు. మీ ఇంట్లో వాళ్ళతోటి, సమాజంతోటి మీరు తగుమాత్రంగా ఉండాలి కానీ అతిగా ఉండకూడదు. మనం మధ్యేమార్గంలో ఉండాలి. అతిగా కనుక ఉంటే అది ఎప్పటికైనా ప్రమాదమే. అది మీకు దుఃఖానికి కారణం అవుతుంది. శంకరాచార్యులు వారు చెప్పింది నగ్నసత్యం. ఎవరూ ఎవరికీ ఏమీ కారు. మీ కుటుంబ బంధాలు కూడా నిజముకాదు, కల్పితమే. ఎవరూ ఎవరికీ ఏమీ కారు ఇది మనస్సులో పెట్టుకొని మీరు పని చేసుకోండి. రాగము, భయము, కోపము ఈ మూడూ కలిపితేనే కల్మషం అవుతుంది. ఇవి అనేక జన్మల నుంచి వస్తున్నాయి. ఈ కెరటాలను తగ్గించుకోమని చెబుతున్నాడు. మనకు భయం వస్తోంది. భయం ఎందుకు వస్తోంది. దీనికి ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే నీకు ద్వైతభావన ఉన్నప్పుడు భయం వచ్చి తీరుతుంది. నీవు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి ఉన్నప్పుడు ఎటువంటి వాడికి అయినా భయం వస్తుంది. అభేదబుద్ధి రావాలి. మిమ్మల్ని చూచి మీకు భయం వేయదు. మీ పక్క వాళ్ళని చూస్తే మీకు భయం వస్తుంది. అద్వైతానుభవంలో ఏమౌతుంది అంటే నాలో ఏ ఆత్మ ఉందో వాడిలోనూ అదే ఉంది. నీలో ఉన్నదే వాడిలో నీకు కనిపిస్తుంది. అప్పుడు వాడిలో ఉన్న వికారాలు నీకు కనపడవు. దేహం తేడా, మనస్సు తేడా అంతే కానీ అందరిలో ఉన్న సద్వస్తువు ఒకటే. అప్పుడు నీకు ఇతరులను చూచినా భయం వేయదు. ద్వైతంలోంచి భయం పుడుతుంది. భయం ఎవడికి పోతుంది. అద్వైతానుభవం ఎవడైతే పొందాడో వాడికి మాత్రమే భయంపోతుంది.

నేను చెప్పింది మీరు నమ్మవద్దు. మీకు ఏ కారణం వలన భయం వస్తోందో పరిశీలనగా చూసుకోండి. మనిషి కూడా నీడ ఎలా వస్తుందో అలా భయం కూడా దుఃఖం వచ్చేస్తుంది. మనిషి కూడా నీడ రాకుండా మనం ఆపుచేయగలమా? అలా నీకు ద్వైత భావం ఉన్నంతకాలం నువ్వు ఎక్కడికి వెళ్ళినా సరే భయం వచ్చేస్తుంది, భయం వెనకాల దుఃఖం వచ్చేస్తుంది, అశాంతి వచ్చేస్తుంది. నువ్వు అది ఆపలేవు. రాగము, భయము, కోపము తగ్గించుకోండి అని చెబుతున్నాడు. తగ్గించుకోకపోతే నష్టం ఏమిటి అంటే, మీకు ఎక్కడైతే ఇష్టం ఉందో, ఆ ఇష్టమైన వాళ్ళకి నష్టం వచ్చింది అనుకోండి మీకు వెంటనే దుఃఖం వచ్చేస్తుంది. మీకు ఇష్టం లేనివాళ్ళకి నష్టం వచ్చింది అనుకోండి అక్కడ దుఃఖము రాదు. మీ ఇష్టం చివరికి దుఃఖం తీసుకువస్తోంది. రాగం ఉన్నా దుఃఖం వచ్చేస్తుంది, కోపం ఉన్నా దుఃఖం వచ్చేస్తుంది. భయం ఉన్నా దుఃఖం వచ్చేస్తుంది. కొంతమంది భగవంతుడిని మోక్షం

అడగరు. అభయస్థితి ఇమ్మని ప్రార్థిస్తారు. గీతాంజలిలో ఠాగూర్ అంటాడు ఓ తండ్రీ ఎక్కడ రాగము లేదో, ఎక్కడ భయము లేదో, ఎక్కడ కోపము లేదో అక్కడకి నన్ను మేల్కొలుపుము అని అంటే ఇవన్నీ ఏ చైతన్యంలో లేవో అక్కడకి నన్ను మేల్కొలుపు తండ్రీ అని ప్రార్థించాడు. సుఖదుఃఖాలు వస్తూఉంటాయి, పోతూంటాయి. వాటికూడా నువ్వు తిరగకు. సంతోషం వచ్చినప్పుడు నువ్వు పట్టించుకుంటే దుఃఖం కూడా నిన్ను పట్టుకుంటుంది. సంతోషం వచ్చినప్పుడు వదిలేశావు అనుకో దుఃఖం కూడా పోతుంది. ఆ రెండూ పట్టించుకోకు. రాగము, భయము, క్రోధము వీటిన్నిటినీ విడిచిపెట్టడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. అర్జునా నువ్వు ఏ యోగాన్ని అవలంభించినా, ఏ సాధనని అవలంభించినా నువ్వు బ్రాహీస్థితి పొందటానికి ప్రయత్నం చెయ్యి అన్నాడు పరమాత్మ.

నిస్పృహః అంటే జరిగే సంఘటనల పట్ల నీకు స్పృహ ఉండకూడదు, ఆసక్తి ఉండకూడదు. బుద్ధుడు రాజ్యాన్ని విడిచిపెట్టాడు. మళ్లీ రాజ్యం తాలుకు తలంపుకాని, ఆసక్తిగాని ఆయనకు రాలేదు. అలాగే మీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చింది అనుకోండి, సంతోషం వచ్చింది అనుకోండి అవి పట్టించుకోకండి. వాటి పట్ల ఆసక్తి ఉండకూడదు. అసలు స్పృహే ఉండకూడదు అంటున్నాడు పరమాత్మ. దుఃఖం వచ్చిందని, లేకపోతే సంతోషం వచ్చిందని నీ మనస్సులో దాని తాలుకు మరకలు ఉండకూడదు. అవి వచ్చి వెళ్లిపోయిన జాడకూడా నీకు తెలియకూడదు. నిర్మమః అంటే ఎక్కడా ఎటాచ్‌మెంట్ పెట్టుకోకు. మీ ఇంట్లో వాళ్ల పట్ల మీరు డ్యూటీ చెయ్యవచ్చు కానీ మమకారం పెట్టుకోవద్దు. మమకారం లేనివాడికి అశాంతి ఏమిటి? పని చెయ్యటం వలన మనకి అశాంతి రాదు. మమకారం పెట్టుకుంటే అశాంతి వస్తుంది. మమకారమే మనకి తొందరగా ముసలితనాన్ని తీసుకువస్తుంది, అనారోగ్యాన్ని, అశాంతిని తీసుకువస్తుంది, చావుని తీసుకువస్తుంది. సర్వ అరిష్టాలకి మమకారమే కారణం. అది మనకు తెలియదు. పరిశీలన చేస్తే మీకు తెలుస్తుంది. మీకు ఎక్కడా మమకారం లేదు అనుకోండి మీ మనస్సు అసలు బాహ్యాముఖానికి రాదు. నిరహంకారః అంటే వ్యక్తిభావన ఉండకూడదు. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని ప్రత్యేకంగా ఆ పేరు మీద కాని, ఆరూపం మీదకాని, నీకున్న పరిస్థితుల మీదకాని నీకు తాదాత్మ్యం ఉండకూడదు. పరిస్థితులు అనేవి ప్రారబ్ధం యొక్క వేగాన్ని బట్టి వస్తాయి. అవి వస్తే రానివ్వండి దాని తాలూకు స్పృహ వదిలేయండి. నిస్పృహః, నిర్మమః, నిరహంకారః ఈ రకంగా కనుక మీరు జీవిస్తే మీకు శాంతి కలుగుతుంది అని పరమాత్మ గీతలో చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగష్టు | 28 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| సెప్టెంబర్ | 1 | ఐ భీమవరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# నిజమైన ధీరుడు

మనందరికి శాంతికావాలి, సుఖం కావాలి. కాని ఏమి చేస్తే శాంతి, సుఖం లభిస్తాయో అది చెయ్యము. అల్పమైన, భ్రాంతిరూపమైన 'దేహాత్మబుద్ధి'ని త్యాగం చేస్తే, అనంతమైన సచ్చిదానందమే మన స్వరూపం అవుతుంది. కాని మిథ్యారూపమైన అహంకారాన్ని త్యాగం చెయ్యడానికి మనం సంసిద్ధులుగా లేము. ప్రపంచంకన్న, ఇతరులకన్న, శత్రువులకన్నా నిగ్రహం లేని మనస్సే మనకు ఎక్కువ దుఃఖాన్ని తీసుకొస్తుంది. మనం బాగుపడినా మనస్సే కారణం, పాడైపోయినా మనస్సే కారణం. ప్రపంచాన్ని జయించిన వానికన్నా, తన మనస్సును జయించిన వాడే నిజమైన ధీరుడు. నిర్మలమైన మనస్సులోనే ఆనందం ఉంది. సరియైన అవగాహన మరియు సహనము సాధకునికి అత్యంత ఆవశ్యకములు. ఏదైనా మంచి సాధించాలనుకొన్నప్పడు శ్రమించేతత్త్వం, విమర్శలను భరించే సహనం ఉండాలి. మనస్సులోని కల్మషం పోతేగాని గురువాక్యం అర్థంకాదు. కాబట్టి మనస్సులోని సంకుచిత భావాలను వదలి, స్వరూపం యొక్క అనంతత్వాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని శ్రవణం చేసి మనన నిధిధ్యాసల ద్వారా అనుభవైకవేద్యం చేసుకోవాలి. మానవుడు సంస్కరింపబడిన మనస్సు గలవాడై, అహంకార మమకార త్యాగముచే జీవభ్రాంతిని విడిచి, తన సహజ సచ్చిదానంద స్వరూపాన్ని అనుభవైకవేద్యం చేసుకుంటే, జనన మరణ సంసార చక్రం నుండి శాశ్వతంగా విముక్తుడవుతాడు. అదే మానవ జీవిత లక్ష్యం.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

అమలాపురం

# స్వాధీనమైన మనస్సు - మోక్షానికి కారణమౌతుంది

మనస్సు నుండి విముక్తి పొందినప్పుడు - గతం ఉండమన్నా ఉండదు. అంటే "గతం" ఖతం. అప్పుడు మనం ప్రస్తుతంలో ఉంటాము. కాని మనస్సుకు మన మాట వినే మంచితనం లేదు. మనకు కావలసిన సత్య విషయాన్ని యోచిస్తూ ఉంటే ఏవిధంగాను ఉపయోగపడక మరోపనికిమాలిన విషయాలపై పోయి అక్కడ కూర్చుంటుంది. దానికి మనం ఇలా చెప్పాలి. "ఏ విషయం నాకు అక్కరలేదు దేన్నీ చింతించకు" అంటే ససేమిరా అంటూ ఒప్పుకోదు. చేతకాని పనికిమాలిన విషయాలు చెబుతున్నావే అది మనకే బుద్ధిచెబుతుంది. అన్ని సమయాల్లోనూ విపరీతమైన ఆలోచనలతో ఊరేగుతుంది. కారణం వేల జన్మల వాసనల బలంముందు మన సాధనాబలం తక్కువ. శ్రీనాన్నగారు "రెండు గొఱ్ఱె పొట్టేళ్ళు దెబ్బలాడుకుంటూ ఉంటే బలమైనది అవతలదాన్ని గెంటుకొని తమురుతుంది. మన సాధనాబలం తక్కువ అయితే మన గతి అంతే" అన్నారు. ఆ మనస్సు ఎలా ఉంటుంది అంటే పిచ్చివాడు ఎప్పుడూ ఏదో గొణుక్కుంటూ ఉంటాడు. వాసన మనలను అలాచేసి తన ఆట తాను ఆడుతుంది. స్వాధీనమైన మనస్సు వేరుగా విధేయంగా మనం ఏడవకుంటే ఏడ్చి, నవ్వమంటే నవ్వే సేవాతత్త్వం దానికి ఉంటుంది. అలా తర్ఫీదు చేయటాన్ని మనోనిరోధం అంటారు. అప్పుడు అది మన ఆజ్ఞకు ఎదురు చూస్తూ ఉంటుంది. జె.కె. "అవసరమైనప్పుడు నా మనస్సును వాడుకొంటాను" అన్నారు అంటే తనకు అనుగుణంగా నడచుకొంటుంది అని. సాధకునికి ఈశ్వరదర్శనం కంటే మనోనిగ్రహం గొప్పదని భావించాలి. అప్పుడు ఈశ్వరదర్శనంతో నిలకడగా ఆనందిస్తూ కూర్చుంటుంది. అప్పుడు మనకు సాధ్యం కానిదంటూ ఉండదు అంటారు అనుభవజ్ఞులు. మనం అస్వతంత్ర మనస్కులం అవ్వటంచేతనే మనం ఇంత బలహీనులమై ఏ కార్యంలో దక్షత లేకుండా ఉన్నాము. మనస్సు మదపుటేనుగు గురు అనుగ్రహమే దానికి అంకుశంలా పొడిచి అది మచ్చిక అయి మనకు అన్ని పనులు చేసి మన ఆజ్ఞకోసం ఎదురుచూస్తుంది. మనస్సును జయించిన మహావీరులు కనుకనే విశ్వామిత్ర - ఆంజనేయులు మహాకార్యాలను అవలీలగా చేసారు. మనోజయమే యోగము. దీనికి సూత్రం మనం ఇతరులకు తాపాన్ని సంతాపాన్ని కలిగించకుండా వారికి క్షేమదాయకంగా హితంగా, శాంతంగా మనం వ్యవహరించాలి. "సత్యం భూత హితం ప్రియ" అన్నారు. త్రికరణశుద్ధి కావాలి. కామకారణం, క్రోధకారణం హృదయంలో ఉండి వాగ్రూపంతో బహిర్గతమైనది సత్యంకాదు. ఇతరులను అగౌరవపరచకూడదు. సత్యవ్రతుని వాక్కు వట్టిపోదు ఏది చేసినా ఫలించి తీరుతుంది. మనకు డబ్బు మీద ఆశలేదు అని జాగ్రదవస్థలో అనుకోవచ్చు ఆ మాటే స్వప్నంలో అనగలిగితే కాంచన విజయం కలిగినట్లే అదే దానికి గీటురాయి. స్వప్నాన్ని అందుకే కల్పించాడు ఈశ్వరుడు మన మనో రోగాలు తెలపటానికే. మనం దైవీ సంపదతో జీవించాలి. గడచిన కాలం రాదు వర్తమానాన్ని సాధనకోసం పరిరక్షించుకొంటే మనస్సు స్వాధీనమౌతుంది. సత్యం ఎరుకపడుతుంది. నిరంతరం గురు ప్రార్థనలో ఉంటే అదే మోక్షకారణమౌతుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం